ప్రజాశక్తి
గురువారం 21 మార్చి 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

దర్శిలో పోటీకి

మద్దిశెట్టి రెడీ..!

- శిద్దా రాకుంటే వేణుగోపాల్‌కే ఛాన్స్
- వీరిద్దరిపైనే ఎంపీ మాగుంట దృష్టి
- తర్జనభర్జన పడుతున్న చంద్రబాబు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తెలుగుదేశం దర్శి అభ్యర్థిపై తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఇంకా సందిగ్ధంలోనే ఉన్నారు. ఎవరిని పెట్టాలనే దానిపై ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు. అక్కడ పలువురు నేతలు టిక్కెట్టు ఆశిస్తున్నా వారికి అవకాశం ఇవ్వలేదు. షెడ్యూల్ ప్రకటించి కోడ్ అమలులోకి వచ్చినా ఇంకా తేల్చలేదు. ప్రస్తుతం మాజీ మంత్రి శిద్దారాఘవరావు, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్లు అధిష్టానం పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరిలో ఒకరు అభ్యర్థి అవుతారనే చర్చ రెండు రోజులుగా సాగుతోంది. ఎంపీ మాగుంట కూడా వీరిద్దరిపైనే దృష్టి సారించారు. ఇద్దరిలో శిద్దాకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన కోసం ఎదురు చూస్తున్నారనే చర్చ నడుస్తోంది. అయితే ఆయన వస్తారా? లేదా? అనేది స్పష్టత లేదు. కారణాలు ఏమైనా ఆయన ఇంత వరకూ బయటపడలేదు. పార్టీతో సంప్రదింపుల్లో ఉన్నారనే చర్చ నడుస్తున్నా ఆయన ఆలోచన ఏమిటనేది వారం రోజులుగా ఎవరికీ తెలియలేదు. జిల్లా నేతలకు కూడా తెలియడం లేదు. ఏం జరుగుతుందోనన్న మీమాంస వీడలేదు. వైసిపికి రాజీనామా చేసి రావాల్సి ఉండగా ఆ దిశగా అడుగులు కనిపించడం లేదు. దర్శి నియోజకవర్గంలోనూ ఇప్పుడు వీరిద్దరిపైనే చర్చ సాగుతోంది. ఎంపీ మాగుంట పార్టీలోకి చేరాక ఆయన శిబిరంలో రాజకీయ వేడి పెరిగింది. దర్శి అభ్యర్థిపై మాగుంట కూడా దృష్టి సారించారు. ఇప్పుడు ఆయన ఎవరిని పెట్టాలంటే వారికే అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో చంద్రబాబు కూడా ఉన్నారు. ప్రస్తుతం శిద్దా రాఘవరావు, మద్దిశెట్టి వేణుగోపాల్ మధ్యనే ఎంపిక ▶ 2లో

సాగని సాగు..



నీరు లేక నెర్రెలిచ్చిన మాగాణి భూమి (ఫైల్)

- ఈ ఏడాది జిల్లా రైతులకు అనుకూలించని ఖరీఫ్, రబీ
- జిల్లాలో 2 లక్షల ఎకరాలకు పైగా తగ్గిన పంటల సాగు విస్తీర్ణం
- ఖరీఫ్‌లో 3,70,407 ఎకరాలకు గానూ 2,66,184 ఎకరాల్లోనే సాగు
- రబీలో 3,86,984 ఎకరాలకు గానూ 2,96,135 ఎకరాల్లోనే పంటలు..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఈ ఏడాది జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. ఖరీఫ్‌లో పంటలకు అవసరమైన సమయంలో వర్షాలు కురవక రైతులు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో అద్దంకి, పర్చూరు ప్రాంత పొలాల సాగుకు నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల జరగలేదు. బాపట్ల, రేపల్లె, చీరాల ప్రాంత పొలాల సాగుకు అవసరమైన సాగునీరు కొమ్మమూరు కాలువ నుంచి సక్రమంగా విడుదల కాలేదు. ఆగస్టు నుంచి సక్రమంగా వరాలు పడక సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంట కాలువలను రైతులే బాగు చేసుకొని ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగునీటికి పొలాలకు తరలించడానికి భగీరథ ప్రయత్నమే చేశారు. దీంతో పాటు వరి, పొగాకు, మిరప పంటల ఫలసాయం రైతుల చేతికందే సమయంలో డిసెంబర్‌లో తుపాను రాకతో భారీవర్షాలు కురియడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్ సీజన్‌లో పంట కాలువల ద్వారా నీరు రాక, వర్షాలు కురవక రైతులు పంటల సాగుకు దూరమయ్యారు. దీంతో ఖరీఫ్‌లో 3,70,407 ఎకరాలకు గానూ 2,66,184 ఎకరాల్లో మాత్రమే పంటల సాగు జరిగినట్లయింది. 1,04,223 ఎకరాల్లో పంటల సాగు జరగలేదు. రబీలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. వర్షాలు కురవక పోవడంతో రైతులు పంటల సాగు సిద్ధపడలేదు. సాగర్ కాలువల ద్వారా మంచినీటి చెరువులు నింపుకోవడం కోసం నీరు విడుదల చేశారే తప్ప పంటల సాగుకు నీటిని విడుదల చేయలేమని ప్రభుత్వం చేతులెత్తేసింది. కొమ్మమూరు కాలువ ద్వారా కూడా జిల్లాలోని ఎగువ ప్రాంత మాగాణి భూములకు కొంతమేర నీటి విడుదల జరిగింది. దిగువనున్న చీరాల, చినగంజాం ప్రాంత భూములను సాగు నీరందలేదు. డిసెంబర్‌లో తుపాను కారణంగా వర్షం కురవడం తప్ప ఆ తరువాతి నెలల్లో వర్షాలు పడలేదు. దీంతో పంటల సాగుకు రైతులు సిద్ధపడలేదు. ఈ కారణంగా రబీలో కూడా 3,86,984 ఎకరాలకు గానూ 2,96,135 ఎకరాల్లోనే పంటల సాగు జరిగింది. ఈ కారణంగా రబీలో కూడా 90,849 ఎకరాల్లో పంటలసాగు జరగలేదు. డిసెంబరులో సంభవించిన తుపాను కారణంగా పొగాకు, మిరప, మొక్కజొన్న పంటలను కోల్పోయిన రైతుల్లో కొందరు తిరిగి అదే పంటలను డిసెంబరు నెలాఖరు నుంచి సాగు చేశారు. కానీ గడచిన మూడు నెలలుగా వర్షాలు కురవక ఆరుతడికి ▶ 2లో

రాజకీయ ప్రచారం చేస్తున్న

వాలంటీర్లను తొలగించాలి..

- నగదుకు ఓట్లు అమ్ముకోవద్దు
- అక్రమాలపై సి-విజిల్‌కి ఫిర్యాదు చేయండి
- ప్రజలకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విజ్ఞప్తి



మాట్లాడుతున్న వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వచ్ఛంగా జరగాలంటే రాజకీయ ప్రచారం చేస్తున్న, అధికార పార్టీ ప్రచార కార్యక్రమాలలో భాగస్వాములవుతున్న వాలంటీర్లను వెంటనే తొలగించాలని ఎన్నికల కమిషన్‌ను సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కోరారు. స్థానిక రంగాభవన్‌లో బుధవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వేతనంతో పనిచేస్తున్న వాలంటీర్లు ఎన్నికల విధులలో భాగస్వాములు కాకూడదని కేంద్ర ఎన్నికల కమిషన్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. స్థానిక అధికార పార్టీ నేతల ప్రోద్బలంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ఐపిసి సెక్షన్ 171, 123 ప్రకారం నేరంగా పరిగణించి అలాంటి వాలంటీర్లను తొలగించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఫొటోల పిచ్చితో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, 104, 108 వాహనాలు, పాస్ పుస్తకాలు, ప్రభుత్వ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ దస్తాలతో పాటు సర్వే రాళ్లు, చివరికి మధ్యాహ్న భోజనంలో భాగంగా అందించే చిక్కీలపై సిఎం ఫొటోలు ఉండడం దురదృష్టకరమన్నారు. వాటన్నింటినీ తొలగించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సంపూర్ణంగా అమలు చేయాలని కోరారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ 15 మంది నిజాయితీపరులైన మేధావులు, విశ్రాంత అధికారులతో ఏర్పడి ఆంధ్రప్రదేశ్ లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేస్తుందన్నారు. అర్హత ఉండి ఓటర్ల జాబితాలో ఓట్లు లేని వారు ఏప్రిల్ 15వ తేదీ లోపు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకొని ఓటు పొందవచ్చని తెలిపారు. ఓటుకు రూ.వెయ్యి తీసుకుంటే ఐదేళ్లలో రోజుకి 54 పైసలు మాత్రమే లభిస్తాయన్నారు. ఈ పరిస్థితుల్లో పవిత్రమైన ఓటు హక్కును డబ్బులు, మద్యం లాంటి ప్రలోభాలకు అమ్ముకోవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల అక్రమాలపై స్పందించడానికి సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 18004250264, వాట్సాప్ నెంబర్ ▶ 2లో

ముగ్గురు వాలంటీర్ల తొలగింపు

ప్రజాశక్తి-పొదిలి

ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నందుకు పొదిలికి చెందిన ముగ్గురు వాలంటీర్లపై అధికారులు వేటు వేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని పొదిలి ఎంపిడిఒ గౌసియాబేగం గుర్తుచేశారు. పొదిలిలో రాజకీయ పార్టీ (వైసిపి) ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న జిలానీ, మజ్నువలీ, మందగిరి రమేష్ అనే ముగ్గురు వాలంటీర్లను విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు చెప్పారు.

కూకట్లపల్లిలో చికెన్‌గున్యా

- ప్రతి ఇంట్లోనూ జ్వరపీడితులు..
- ఒళ్లు నొప్పులతో అల్లాడుతున్న బాధితులు
- పట్టించుకోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు



చికెన్ గున్యాతో మంచం పట్టిన వృద్ధురాలు

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

మండలంలోని కూకట్లపల్లిలో చికెన్ గున్యా విజృంభించింది. గ్రామంలోని 90 శాతం ఇళ్లల్లో ప్రతి ఇంట్లో జ్వరం, ఒళ్లునొప్పులతో బాధితులు అల్లాడిపోతున్నారు. గత పది రోజులుగా వందల మంది బాధితులు వైద్యం కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. నరసరావుపేట, ఒంగోలు, అద్దంకి, మేదరమెట్ల, చిలకలూరిపేట, తదితర ప్రాంతాల్లో వైద్య చికిత్స పొందుతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు మిన్నకుండిపోయారు.

కూకట్లపల్లిలో చికెన్ గున్యా కారణంగా జ్వరం, ఒళ్లునొప్పులతో బాధితులు విలవిలలాడుతున్నారు. పది రోజుల నుంచి జనం ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వ వైద్యులు గానీ, వైద్య అధికారులు గానీ ఆ గ్రామాన్ని సందర్శించలేదు. మెడికల్ క్యాంపులు నిర్వహించలేదు. బాధితుల్లో ఎక్కువమంది మేదరమెట్లలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందారు. బాధితుల్లో మాజీ సర్పంచ్ కూడా ఉన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటిలో ఒకరు, ఇద్దరు చొప్పున చికెన్‌గున్యా బారినపడ్డారు. కొంతమందికి ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొంది ఇంటికి వచ్చినా.. ఒళ్లు నొప్పులు తగ్గలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యాధికారులు వెంటనే స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం

గ్రామంలో పారిశుధ్యం ఎప్పటినుంచో పడకేసింది. మురికి కాలువల్లో మురుగునీరు ప్రవహించక ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా గ్రామస్తులంతా చికెన్‌గున్యా బారినపడి విలవిలలాడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.



హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మహిళ

మొన్న టిడిపి.. నేడు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల మండలం పాలకవీడు పంచాయితీ పరిధిలోని ఓబుల్ రెడ్డి పల్లె గ్రామానికి 30 వైసిపి కుటుంబాల వారు రెండు రోజుల క్రితం టిడిపిలో చేరారు. వైసిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి సమక్షంలో బుధవారం వైసిపిలో చేరారు. అనంతరం మండలంలోని సోమిదేవిపల్లె గ్రామ వైసిపి నాయకులు కార్యకర్తలతో కుందురు నాగార్జున రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దర్శిలో పోటీకి మద్దిశెట్టి రెడీ.!

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారం నడుస్తోంది. ఎమ్మెల్యే మద్దిశెట్టి కూడా పోటీకి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. తెలుగుదేశం అధిష్టానంతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటు మాగుంటను కూడా అడిగినట్లు తెలిసింది. మరోవైపు గోరంట్ల రవికుమార్, గరికపాటి వెంకట్‌పైనా ఫోన్‌లో అభిప్రాయ సేకరణ సాగుతోంది. గొట్టిపాటి రవికుమార్ కూడా తన సోదరుడు నరసయ్య కుమారైకు ఇవ్వాలని కోరారు. దీనిపైనా చంద్రబాబు సమాలోచనలు చేస్తున్నారు. అన్ని వైపులా దృష్టి సారించారు. అధినేత ఆశించిన వ్యక్తి ముందుకు రానందునే ఆలస్యమైనట్లు భావిస్తున్నారు. శిద్దా రాఘవరావు ఒకటి రెండ్రోజుల్లో తేల్చకపోతే ఎమ్మెల్యే మద్దిశెట్టికే అవకాశం ఇస్తారనే చర్చ అటు మాగుంట శిబిరంలోనూ నడుస్తోంది. దర్శిలో కూడా మద్దిశెట్టి అనుచరులు తమకే టిక్కెట్టు ఇస్తారనే ధీమాలో ఉన్నారు. శిద్దా ఆసక్తిగా లేనందున మద్దిశెట్టికే అవకాశం ఉందనే గట్టి నమ్మకంలో ఉన్నారు. నియోజకవర్గంలోనూ రెండు రోజులుగా మద్దిశెట్టి పేరు తీవ్ర ప్రచారంలో ఉంది. ప్రస్తుతం సాగుతున్న పరిణామాలు చూస్తే దర్శి అభ్యర్థి ఎంపిక వ్యవహారం తుదిదశకు వచ్చినట్లు తెలుస్తోంది. నేడోరేపో తేలిపోతుందని భావిస్తున్నారు. ఏదేమైనా దర్శిపై తెలుగుదేశం అధినేత చంద్రబాబు తక్షణం ఓ నిర్ణయానికి రాకుంటే.. ఎన్నికల్లో ప్రచారంలో వెనుకబడితే నష్టం జరుగుతుందని దర్శిలో పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

రాజకీయ ప్రచారం చేస్తున్న వాలంటీర్లను తొలగించాలి

(మొదటిపేజీ తరువాయి)

879000557ను వినియోగించుకోవా లని కోరారు. ఎలక్షన్ కమిషన్ రూపొందించిన సి-విజిల్ యాప్ ను ప్రతి ఒక్కరూ ఉప యోగించుకొని ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మేధావులు మౌనం వీడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం తోడ్పడాలని కోరారు. అక్షరాస్యతలో 30వ స్థానంలో ఉండటం, రాజకీయ అవినీతి ఘనంగా పెరగడం, పరిశ్రమలు రాకపోవ డంతో ఉపాధి అవకాశాలు తగ్గడం, నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం లాంటి అనేక సమస్యలతో సతమతమవుతున్న ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి వైపు పరుగులు తీయించే అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు. విశ్రాంత ఎస్‌పి సుంకర సాయిబాబు ప్రసంగిస్తూ రాజకీయ పార్టీలు హింసపూరిత చర్యలకు చరమగీతం పాడాలని కోరారు. ఇటీవల గిద్దలూరులో పి.మునెయ్య అనే వ్యక్తిని ప్రజాగళం సభకు జనాన్ని తీసుకుని వెళ్లారనే కారణంతో అధికార పార్టీ వాళ్లు దారుణంగా హత్య చేయడం దుర్మార్గమన్నారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అందరికీ ఉండాలన్నారు. ఒంగోలు పట్టణ అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు కొల్లా మధు మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందించే నిస్వార్థ రాజకీయ నేతలను ఎన్నుకోవాలని కోరారు. సుపరిపాలన వేదిక ఉపాధ్యక్షులు కంచర్ల సుబ్బారావు మాట్లాడుతూ కులం, మతం, డబ్బు, మద్యం లాంటి ప్రలోభాలకు లోను కాకుండా సుపరిపాలనను అందించే నేతలను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆల్రెడ్ , కర్నూల్ రోడ్డు షాప్ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మారెళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలోని 17వ వార్డుకు చెందిన 12 కుటుంబాల వారు బుధవారం వైసిపిలో చేరారు. గిద్దలూరు ఎమ్మెల్యే, వైసిపి మార్కాపురం అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు సమక్షంలోవారు పార్టీలో చేరారు. అన్నా రాంబాబు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైసిపి నాయకులు కరీముల్లా, సయ్యద్ గఫూర్ ఆధ్వర్యంలో వారు వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్‌అలీబేగ్, వైసిపి నాయకులు డాక్టర్ షేక్ మక్బుల్‌బాష, షేక్ కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.

సాగని సాగు..

(మొదటిపేజీ తరువాయి)

కూడా నీరందక రైతులు ఇక్కట్ల పాలయ్యారు. మార్చిలో పంట చేతికందే సమయంలో నీరు లేక పొలాలు బీటలు వారాయి. రైతులు ఒక్కొక్క ట్యాంకర్‌కు రూ.4 వేలు వెచ్చించి ఎక్కడ నీరు దొరికితే అక్కడ నుంచి రప్పించుకున్నారు. ఒక్కొక్క తడికి 10 టాంకర్లు అవసరమయ్యాయి. రెండు తడులకు సాగు నీటి కోసమే రైతులు అత్యధికంగా ఖర్చు చేయవలసి వచ్చింది. తుపాను నష్టంతో పాటు తిరిగి మళ్లీ సాగు పెట్టుబడులు పెట్టి, చివరికి సాగునీటి కోసం మరింత వ్యయం చేసి రైతులు సాగు ఖర్చులు రెట్టింపయ్యాయి. తోటి రైతులు పంటలు సాగు కోసం పడుతున్న కష్టాలు గమనించిన రైతులు అత్యధికులు ఈ ఏడాది పంటల సాగుకు సమాయత్తం కాలేదు. ఆర్థిక స్తోమత ఉన్నవారు, అప్పులు దొరికిన రైతులు పంటలు సాగు చేసి ఇబ్బందుల పాలయ్యారు. జిల్లాలోని రైతులు పలు కారణాలతో పంటల సాగుకు సిద్ధపడక పోవ డంతో జిల్లాలో సుమారుగా రెండు లక్షల ఎకరాల్లో భూములు సాగుకు నోచుకోలేదు. రైతులకు కష్టాలు తప్పడం లేదు.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో :: ఒంగోలు

ఏ.యస్.నం.9/2023

మధ్యలో

జాగర్లమూడి పేరయ్య మరియు ఇతరులు ...అప్పిలెంట్లు

మరియు

పేర్ల మోహనరావు మరియు ఇతరులు...రెస్పాండెంట్లు

టు :

R12) గోపిశెట్టి శ్రీనివాసరావు తండ్రి కోటయ్య, బండ్లమిట్ట, ఒంగోలు.

R14) వడపల్లి లక్ష్మీ, వినాయక టెంపుల్, గంటపాలెం, ఒంగోలు.

R17) బండారు పద్మావతి, భర్త ఏడుకొండలు, వడ్డిపాలెం, పద్మావతి టెంపుల్, గంటాపాలెం, ఒంగోలు.

R20) కోరుకొండ విజయలక్ష్మి భర్త సుబ్బారావు, బండ్లమిట్ట, ఒంగోలు.

R24) ముత్యం రవణమ్మ భర్త క్రిష్ణమూర్తి, ఒంగోలు.

R31) పువ్వాడి స్పందన భర్త మహేష్, బొందిలివారి వీధి, బండ్లమిట్ట, ఒంగోలు.

R36) బండారు శ్రీనివాసరావు, తండ్రి శ్రీనివాసరావు, బండారువారి వీధి, బండ్లమిట్ట, ఒంగోలు.

R37) బండారు రంగనాథ్ తండ్రి (లేటు) కోటేశ్వరరావు, బండారువారి వీధి, బండ్లమిట్ట, ఒంగోలు.

నోటీసు

పై నంబరు దావాలో మీ హాజరు నిమిత్తం అనేక పర్యాయములు గౌరవనీయులైన పై కోర్టువారు, కోర్టు ద్వారాను మరియు రిజిస్టరు పోస్టు ద్వారాను నోటీసును పంపిననూ, మీకు జారీ కానందున ఈ పత్రికా ప్రకటన ద్వారా పై కోర్టువారు తేది : 04-03-2024న మీకు నోటీసును ఆర్డరు చేసియున్నారు. కావున తేది 04-04-2024న మీరు స్వయముగా గానీ, లేదా అడ్వొకేట్ ద్వారా గానీ ఉదయం గం.10-30 ని॥లకు గౌరవనీయులైన పై కోర్టువారి ఎదుట హాజరై పై నెంబరు ఇ.పి.లో మీ ఆక్షేపణలు తెలుపగలరు. లేని యెడల గౌరవనీయులైన పై కోర్టువారు మీ పరోక్షమున పై ఇ.పి.ని తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

// పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

తేది : 20-03-2024,

స్థలం : ఒంగోలు.

ఇట్లు
సి.వి.రామక్రిష్ణారావు,
అడ్వొకేట్,
ఒంగోలు, ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No.565/2022
I.A.No.733/2017
O.S.No.48/2015

గాధంశెట్టి వెంకట ప్రసాదరావు - పిటిషనర్

Vs

గొస్తు వెంకట సుబ్బారావు (Died)
మరియు వగైరాలు - రెస్పాండెంట్స్

To,

R3. గొస్తు ఈశ్వరమ్మ, భర్త లేట్ వెంకట సుబ్బారావు, R/o రాచూరివారి వీధి, పామూరు గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా.

అయ్యా,

పై నెంబరు పిటిషన్‌లో పరిహారం కోరి మీ మీద పిటిషనర్, పిటిషన్‌ను దాఖలు చేసియుండుట వలన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నోటీసు పంపించి నపూ జారీ కానందువలన ఈ ప్రకటన ద్వారా తెలియజేయమని పై పిటిషన్‌ను తే22-03-2024దిన వాయిదా వేసియున్నారు. కావున పై తేదీ యందు **ఉదయం గం॥ 10-30 నిమిషములకు** పైకోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీని స్వయంగా గానీ,లాయర్ ద్వారా గానీ తెలుపుకొనవలసినదిగా మిమ్మల్ని ఆదేశించడమైనది. పై తేదీ నందు మీరు హాజరుకానియెడల మీ పరోక్షమందు పై పిటిషన్‌ను తీర్మానించెదరు.

వాయిదా: 22-03-2024

//పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

శ్రీ పెన్నా కృష్ణయ్య
శ్రీ నాదెళ్ళ యల్లమందరావు
పిటిషనర్స్ తరపు అడ్వకేట్స్
కందుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No.564/2022
I.A.No.733/2017
O.S.No.48/2015

గాధంశెట్టి వెంకట ప్రసాదరావు - పిటిషనర్

Vs

గొస్తు వెంకట సుబ్బారావు (Died)
మరియు వగైరాలు - రెస్పాండెంట్స్

To,

R3. గొస్తు ఈశ్వరమ్మ, భర్త లేట్ వెంకట సుబ్బారావు, R/o రాచూరివారి వీధి, పామూరు గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా.

అయ్యా,

పై నెంబరు పిటిషన్‌లో పరిహారం కోరి మీ మీద పిటిషనర్, పిటిషన్‌ను దాఖలు చేసియుండుట వలన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నోటీసు పంపించి నపూ జారీ కానందువలన ఈ ప్రకటన ద్వారా తెలియజేయమని పై పిటిషన్‌ను తే22-03-2024 దిన వాయిదా వేసియున్నారు. కావున పై తేదీ యందు **ఉదయం గం॥ 10-30 నిమిషములకు** పైకోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీని స్వయంగా గానీ,లాయర్ ద్వారా గానీ తెలుపుకొనవలసినదిగా మిమ్మల్ని ఆదేశించడమైనది. పై తేదీ నందు మీరు హాజరుకానియెడల మీ పరోక్షమందు పై పిటిషన్‌ను తీర్మానించెదరు.

వాయిదా: 22-03-2024

//పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

శ్రీ పెన్నా కృష్ణయ్య
శ్రీ నాదెళ్ళ యల్లమందరావు
పిటిషనర్స్ తరపు అడ్వకేట్స్
కందుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: ఒంగోలు

ఐ.ఏ.నం. /2024
ఇ.పి.నం.245/2019
ఓ.యస్.నం.184/2016

మధ్యలో

చంద్రపాటి లక్ష్మి లలిత ...డి.హెచ్.ఆర్

మరియు

కొనకళ్ల శ్రీరంగ నారాయణ వురఫ్ సరోజ్ బాబు ...జె.డి.ఆర్

టు :

కొనకళ్ల శ్రీరంగనారాయణ వురఫ్ సరోజ్‌బాబు, తండ్రి కోటేశ్వరరావు, వ్యాపారం, నివాసం – సరోజ్ గ్రానైట్స్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఎక్స్‌టెన్షన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

నోటీసు

పై నంబరు దావాలో మీ హాజరు నిమిత్తం అనేక పర్యాయములు గౌరవనీయులైన పై కోర్టువారు, కోర్టు ద్వారాను మరియు రిజిస్టరు పోస్టు ద్వారాను నోటీసును పంపిననూ, మీకు జారీకానందున ఈ పత్రికా ప్రకటన ద్వారా పై కోర్టువారు మీకు నోటీసును సి.పి.సి. ఆర్డర్ 21, రూలు 66 క్రింద ఆర్డరు చేసియున్నారు. కావున తేది 01-04-2024న మీరు స్వయముగా గానీ, లేదా అడ్వొకేట్ ద్వారా గానీ ఉదయం గం.10-30 ని॥లకు గౌరవనీయులైన పై కోర్టువారి ఎదుట హాజరై పై నెంబరు ఇ.పి.లో మీ ఆక్షేపణలు తెలుపగలరు. లేని యెడల గౌరవనీయులైన పై కోర్టువారు మీ పరోక్షమున పై ఇ.పి.ని తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

// పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

తేది : 20-03-2024,

స్థలం : ఒంగోలు.

ఇట్లు
సి.వి.రామక్రిష్ణారావు,
అడ్వొకేట్,
ఒంగోలు, ప్రకాశం జిల్లా.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో, ఒంగోలు.

GWOP : 6/2024

Between

పొంగూరి శ్రీనివాసరావు ..... పిటిషనర్

వర్సెస్

పొంగూరి రామతీర్థం .... రెస్పాండెంట్

జనరల్ నోటీసు

పై గార్డియన్ ఓపి లో పిటీషనర్, మైనర్ అయినటువంటి పొంగూరి శర్వానికి న్యాచురల్ గార్డియన్ అయినందువల్ల, మైనర్ కు షెడ్యూలు దాఖల ఆస్తిలో హక్కు కలిగిన 1/3 వంతు భాగాన్ని అమ్ముటకు, పై కోర్టు వారి ఎదుట అనుమతి కొరకు గార్డియన్ ఓపి దాఖలు చేయడమైనది. పొంగూరి శర్వానికి గల 1/3 వంతు భాగాన్ని పొంగూరి శ్రీనివాసరావు అమ్ముటకు ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల గౌరవ కోర్టు వారి ఎదుట 04-04- 2024 న ఉదయం 10:30 కు స్వయంగా గాని వారి న్యాయవాది ద్వారా గాని తమఆక్షేపణలను సమర్పించ గలరు. లేనియెడల వారి పరోక్షములో కోర్టు వారు విచారించుటకు తీర్మానించారు.

షెడ్యూలు ఆస్తి హద్దులు :- ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలం, త్రోవగుంట మజర, వలేటి వారి పాలెం గ్రామం త్రోవ గుంట సర్వే నెంబరు 546/2

తూర్పు : పంచాయితి రోడ్డు.

దక్షిణము : మామిడి వరదరాజు ఆస్తి.

పడమర : కరవాది అంజనే యులు,వీరాస్వామి ఇల్లు.

ఉత్తరము : మా తాలూకా ఆస్తి. పై హద్దులలో "532" చదరపు అడుగులు లేక 7 గదుల28 చదరపు అడుగుల ఖాళీ స్థలం

// గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

తేదీ : 20-04-2024

ప్రదేశము : ఒంగోలు

వాయిదా తేదీ : 04-04-2024

ఇట్లు
నల్లూరి అవనీష్
మిరియాల శ్రీనివాసరావు.
న్యాయవాదులు.
జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు.

కుటుంబ కలహాలతో.. భార్యను కడతేర్చిన భర్త

- రోశయ్య కాలనీ వద్ద పొలాల్లో ఘటన

ప్రజాశక్తి-చీరాల

కుటుంబ కలహాల నేపథ్యంలో ప్రేమించి పెళ్లి చేస్తుకున్న భార్యనే భర్త కడతేర్చాడు. ఈ ఘటన చీరాలలోని రోశ్యయ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం... రోశయ్య కాలనీకి చెందిన దేవర లక్ష్మీనారాయణ టాటా ఏసీ వాహనం డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గతంలో నల్గొండ జిల్లాకు చెందిన లక్ష్మి (35) అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కుమారుడు వరుణ్ తేజ్ 8వ తరగతి చదువుతున్నాడు. కుమార్తై శరణ్య 5వ తరగతి చదువుతుంది. ఈ నేపథ్యంలో లక్ష్మీనారాయణ మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశాడు. అనంతరం పిల్లలను ఇంటిలో పడుకోమని చెప్పాడు. భార్య లక్ష్మిని ఊరి చివర బయట పొలాల్లోకి తీసుకెళ్లాడు. బుధవారం ఉదయాన్నే లక్ష్మీనారాయణ తమ బంధువుల ద్వారా కుమారుడు వరుణ్ తేజ్‌కు ఫోన్ చేశాడు. తినుబండారాలు, బీడీలు తీసుకొని రమ్మని చెప్పాడు. పిల్లలు తినుబండారాలు, బీడీలు తీసుకొని పొలాల వైపు వెళ్లారు. తండ్రి ఎదురొచ్చి వాటిని తీసుకొనేందుకు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రయత్నించాడు. అమ్మ కనిపించడం లేదని, ఎక్కడి వెళ్లిందని కొడుకు తండ్రి ప్రశ్నించాడు. మాట్లాడదామని పొలాల్లోకి తీసుకొచ్చినట్లు తండ్రి చెప్పాడు. తండ్రిపై



రోధిస్తున్న మృతురాలి కుమార్తై

అనుమానంతో పిల్లలు తల్లికోసం గాలించారు. సమీపంలోని పొలంలో లక్ష్మి విగత జీవిగా పడి ఉండటాన్ని వారు గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో లక్ష్మీనారాయణ అక్కడి నుంచి పరారీ అయ్యాడు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని లక్ష్మి మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయారు. భార్య లక్ష్మిపై అనుమానంతో భర్త లక్ష్మీనారాయణ వేధించేవాడని బంధువులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆర్‌డిఒ జాన్ ఇర్విన్

ప్రజాశక్తి -కనిగిరి

ఎన్నికల నింబధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని కనిగిరి ఆర్‌డిఒ మరియు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాలపర్తి జాన్ ఇర్విన్ తెలిపారు. ఆర్‌డిఒ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల నియమావళిపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారం చేపటా ్టరాదన్నారు. వాహనాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పార్టీ కార్యకలాపాలు నిర్వహించరాదని తెలిపారు. సివిజిల్ యాప్ ను ఉపయోగించి



మాట్లాడుతున్న ఆర్‌డిఒ

అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, పిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ వైఎం.ప్రసాద్ రెడ్డి, బిజెపి నాయకులు నరాల శ్రీనివాసరెడ్డి, సిపిఎం నాయకులు పిసికేశవరావు, బిఎస్‌పి నాయకులు టి. ప్రభుదాస్, వివిధ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్యకు దద్దాల నివాళి

ప్రజాశక్తి - సిఎస్ పురంరూరల్

మండల పరిధిలోని ఏకునాంపురం గ్రామానికి చెందిన అన్నెబోయిన కష్ణయ్య మంగళవారం గుండెపోటుతో మతి చెందాడు. ఆయన మృతదేహాన్ని వైసిపి కనిగిరి నియోజకవర్గ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలియజేశారు. నివాళు లర్పించిన వారిలో జడ్‌పిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, సచివాలయాల మండల అధ్యక్షుడు బైరెడ్డి తిరుపతిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నారాయణ యాదవ్

లారీ,కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

లారీ, కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఉప్పుగుండూరు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో మద్రిపూడి మండలం గుండ్లసముద్రం గ్రామానికి చెందిన కోవెలకుంట్ల శివ కష్ణ (33) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం...ఒంగోలు నుంచి చీరాల వైపు వెళ్తున్న లారీ, ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న శివ కష్ణకు తీవ్ర గాయాలయ్యాయి .క్షగాత్రుడిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అప్పటికే శివకృష్ణ మృతి చెందిన వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. బ్రహ్మనాయుడు తెలిపాడు.

పొగాకు బ్యారెన్ దగ్ధం

ప్రజాశక్తి-పొదిలి

మండల పరిధిలోని మాదాలవారిపాలెంలో బుధవారం ప్రమాదవశాత్తు చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో నుగ్గ శ్రీనివాసులు అనే రైతుకు చెందిన పొగాకు బ్యారన్ దగ్ధమైంది. ఉదయం 10గంటల సమయంలో బ్యారన్ నుంచి మంటలు రావడంతో స్థానికుఉలు గుర్తించి ఆర్పే ప్రయ్నుతం చేశారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో దర్శి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మంటలను అదుపు చేశారు. అప్పటికే బ్యారెన్‌లోని పొగాకు కాలి బూడిదైంది.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ కనిగిరి డివిజన్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ 1104 కనిగిరి డివిజన్ విస్తత స్థాయి సర్వసభ్య సమావేశం భైరవకొనలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. కనిగిరి డివిజన్ అధ్యక్షుడిగా షేక్ నాయబ్ రసూల్,కార్యదర్శిగా సిహెచ్.హరికష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అనిల్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్ కష్ణ, ట్రెజరర్‌గా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డిస్కం అధ్యక్షుడు రాచగర్ల సంజీవరావు, కార్యదర్శి నందిగామ శర్మ, ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ సిబ్బంది , విద్యుత్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బ్యారెన్ నిర్మాణం ఆపాలని వినతి

ప్రజాశక్తి - టంగుటూరు

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా చేపట్టిన పొగాకు బ్యారన్ నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలని గ్రామస్తులు అధికారు లకు మొర పెట్టు కుంటున్నారు. టంగుటూరు మండలం కాకుటూరు వారిపాలెం గ్రామానికి చెందిన మార్టూరి వెంకట్రావు అనే వ్యక్తి అక్రమ నిర్మాణలకు పాల్పడు తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయిన్పటికీ అధికారులు పట్టించుకోక పోవడం దారుణంగా ఉందన్నారు. బ్యారన్ అక్రమ నిర్మాణాలపై పొగాకు బోర్డు అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన చర్యలు తీసుకుపోగా ఆక్రమణదారులకు వత్తాసు పలుకు



ప్రభుత్వ స్థలంలో నిర్మాస్తున్న పొగాకు బ్యారెన్

తున్నాడని గ్రామస్తులు ఆరో పిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా తాను కాకుటూరువారిపాలెం గ్రామ కార్యదర్శిగా విధులలో లేనట్లు చెప్పాడన్నారు. ఎంపిడిఒకు ఫిర్యాదు చేయగా ఆయన కూడా అధికార పార్టీ నాయకుడితో తమకెందుకు వివాదం అంటూ మౌనంగా ఉన్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

'అన్నా ట్యాంకు' స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండల కేంద్రమైన కొత్తపట్నంలో తహశీల్దారు కార్యాలయం ఎదురుగా ఉన్న అన్నా ట్యాంక్ స్థలం ఆక్రమణకు గురవుతోంది. గతంలో ఈ చెరువు స్థలం భారీ ఎత్తున ఆక్రమణకు గురైంది. నాలుగైదు రోజులుగా మళ్లీ ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. తాజాగా సుమారు ఎకరానికి పైగా చెరువు స్థలం ఆక్రమణకు గురైంది. కొందరు చెరువు స్థలంలో మట్టితోలి చదును చేశారు. అందులో పశు వుల పాక ఏర్పాటు చేశారు. రెవెన్యూ కార్యాలయానికి ఎదురుగా ఉన్న జగనన్న కాలనీకి వెళ్లే రహదారి పక్కనే చెరువు స్థలం ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇపప్పటి వరకూ సుమారుగా 20 ఎకరాలపైగా చెరువు ఆక్రమణకు గురైనట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ చెరువు కింద 400 ఎకరాల ఆయుకట్టు ఉంది. చెరువు నీటిపై ఆధారం పడి అనేకమంది రైతులు పంటలు పండించు కుంటున్నారు. ఈ చెరువు ఆక్రమణకు గురైతే రైతులకు నీటి ఇక్కట్లు తప్పవు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రణల చెరనుంచి చెరువు స్థలాన్ని రక్షించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



ఆమ్రకణకు గురైన చెరువు స్థలం ఇదే

కబ్జా కోరల్లో కవలకుంట్ల చెరువు

◆ మాయమవుతున్న చెరువు..భూ మాయగాళ్లే కారణం ◆ పట్టించుకోని రెవెన్యూ అధికారులు చర్యలు శూన్యం

ప్రజాశక్తి - పుల్లలచెరువు

మండలంలోని కవలకుంట్ల గ్రామంలోని చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. కొందరు చెరువు అంతర్భాగాన్ని ఆక్రమించి పంటల సాగు కోసం చిల్ల చెట్లను తొలగించారు. కొంత కాలంగా చెరువు చుట్టూ ఉన్న రైతులు చెరువులో బోర్లు వేయడంతో వర్షం కురిసినప్పుడు నీరు నిల్వ లేకుండా పోతున్నాయి. ఆక్రమణల కారణంగా చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల చారిత్ర కలిగిన కవలకుంట్ల చెరువు కబ్జాకు గురవుతోంది. దశాబ్దాలుగా చెరువు క్రమక్రమంగా కుదించుకుపోతుంది. చెరువును పరిరక్షించుకోవాల్సిన ప్రభుత్వ శాఖలు కబ్జాదారులు విసిరే కాసులకు దాసోహం అంటున్నారు. చెరువు ఆక్రమణలను అరికట్టాల్సిన వివిధ శాఖలు ఆక్రమణలను చట్టబద్దం చేస్తున్నాయి. కొంత మంది రాజకీయ నాయకులకు, అధికారులకు డబ్బులు ముడుతుండడంతో కబ్జాదారులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఏకంగా చెరువు లోపలే ఆక్రమణకు దిగారు. కబ్జాదారులకు కవలకుంట్ల శివారుల్లోని చెరువు సిరులు కురిపిస్తుంది. రెవెన్యూ, చిన్ననాటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజాప్రతినిధుల పేరు చెప్పి, అధికారులను బెదిరించి మరీ చెరువును ఆక్రమించుకుని హద్దులు వేసుకుని ట్రాక్టర్లతో చదును చెయ్యడానికి సిద్ధపడుతున్నారు. మండలంలోని చెరువులు కబ్జాదారుల చేతుల్లో కబ్జాకి గురై వ్యవసాయ భూముల్లా మార్చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాకు గురవుతున్న చెరువులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


కబ్జాకు గురైన కవలకుంట్ల గ్రామంలోని చెరువు

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

ప్రజాశక్తి - కురిచేడు

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యకర్తలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను బుధవారం ప్రారంభించారు. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్ద, యూనియన్ బ్యాంక్ పరిసర ప్రాంతాల్లో చలివేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో శివ ప్రసాదరెడ్డి సతీమణి నందిని, జడ్‌పిటిసి నుసుం వెంకట నాగిరెడ్డి, వూట్ల వెంకటేశ్వర్లు, మేరువ పిచ్చిరెడ్డి, నారు శ్రీనివాసరెడ్డి, నుసుం సుబ్బారెడ్డి, నెంపిటిసి బుల్లం వెంకట నరసయ్య పాల్గొన్నారు.

బూచేపల్లి పర్యటన : మన ఊరికి శివన్న కార్యక్రమంలో భాగంగా మండలంలోని పడమర గంగవరం, రెడ్డన్న పల్లె గ్రామాల్లో విస్తృతంగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి పర్యటించారు. రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్విత పరిష్కార దిశగా ప్రయత్నాలు చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఆయన భార్య నందిని, జడ్‌పిటిసి నుసుం వెంకట నాగిరెడ్డి, సర్పంచ్ కాసు భాస్కర్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు అన్నెం అరుణ పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకామయ్మ



తల్లికి తోడుగా చిత్తు కాగితాలు ఎత్తుకున్న బాలిక

చెత్తకాగితాల మధ్య చిత్తవుతున్న బాల్యం

ప్రజాశక్తి - పిసిపల్లి

చెత్తతాగితాల మధ్య బాల్యం చిత్తవుతోంది. తమ పిల్లలను బడికి పంపాలనే కోరిక ఉన్న పేదరికం వలన విధిలేని పరిస్థితుల్లో వెంటతెచ్చుకుంటున్నామన్నారు. 8ఏళ్ల బాలిక తల్లితోపాటు ఉదయాన్నే వేకువజామునే లేచి చిత్తుకాగితాలు ఏరుకుంటు తల్లితోపాటు ఉంటుంది. ప్రభుత్వానికి ఇవేమి కనిపించడం లేదు. కందుకూరుకు చెందిన దార్ల దుర్గమ్మకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. వీరిలో 3వ కుమార్తె పోలమ్మ వయస్సు 8 సంవత్సరాలు. ఈ బాలిక కందుకూరు నుండి వేకువ జామున్నే పిసిపల్లికి వచ్చి సెంటర్‌లో ఉన్న టి దుకాణాలు, అంగళ్లు, ఇళ్ళ మధ్య ఉండే ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, చిత్తు కాగితాలు, ఏరుకుంటూ ప్రజాశక్తి కంట పడింది. తల్లితోపాటు ఏరిన కాగితాలను నెత్తిన పెట్టుకొని సుమారు పర్లాంగు దూరం తీసుకొచ్చి పిసిపల్లి ప్రభుత్వ పశువైద్యశాల ఆవరణలో పేడదిబ్బలమధ్య వేసింది. ఒక వైపు చిన్నారి ఆటపాటలతో చదువుకోవాల్సిన సమయంలో చినిగిన దుస్తులతో, చింపిరి నెత్తితో పేడ దిబ్బల మధ్య, కుళ్లిన ఎరువుల మధ్య ఉదయాన్నే దుర్గంధంను పీల్చుతూ తల్లికి చేదోడు వాదోడుగా ఉంటుంది. మరో వైపు పశువుల ఆసుపత్రి సమీపంలోనే ఉన్న జడ్‌పి హైస్కూల్‌కు 10వ తరగతి పరీక్షలు రాసేందుకు ముచ్చటగా బాలబాలికలు వచ్చారు. ఈ రెండు కూడా ఎదురెదురుగానే కళ్ళకు కనపడుతున్నాయి. ఈ విధంగా పేదరికంతో ఒక వైపు బాలికలకు చదువుకొనే అవకాశం లేక చిన్నవయస్సు నుండే రకరకాల పనులు చేస్తూ దర్శనమించ్చారు. ప్రభుత్వం చదువు చెప్పించిన తిండికి కూడా కష్టమంటూ దుర్గమ్మ తెలిపింది. ఇక్కడ ఉచిత నిర్బంద విద్య అనేది కనిపించలేదు. ఇలాంటి వారు తక్కువ కులాలు, నిమ్నకులాలకు చెందిన చిన్నారులు పిసిపల్లిలో దర్శనమిస్తారు.


చిత్తు ఏరుతున్న బాలిక

సా.... గుతున్న 'నాడు-నేడు' పనులు

విద్యార్థులకు తప్పని కష్టాలు

ప్రజాశక్తి - యర్రగొండపాలెం

నాడు-నేడు పథకంతో బడుల రూపు రేఖలు మారుస్తామని, కార్పొరేట్ స్థాయిలో వాటిని తీర్చిదిద్దు తామన్న అధికార పార్టీ నేతల మాటలకు క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు పూర్తిగా భిన్నంగా ఉంది. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయి విద్యార్థులకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు. పాఠశాల స్థలంలో నిల్వ ఉంచిన ఇసుక, ఇనుము, సిమెంట్, కంకరతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. మొదటి విడత విడుదల చేసిన నిధులు పూర్తిగా అయిపోవడంతో మిగిలిన పనుల కోసం నిధుల మంజూరు కోసం గుత్తేదారులు, హెచ్‌ఎంలు పనులు చేయించడానికి ఎదురు చూస్తున్నారు.

నెలల తరబడి ఆటంకాలు

యర్రగొండపాలెం మండలంలో 17 పాఠశాలల్లో 72తరగతి గదులు, త్రిపురాంతకం మండలంలో 37 పాఠశాలలో 77తరగతి గదులు, పుల్లలచెరువు మండలంలో 25 పాఠశాలలో 66 తరగతి గదులు, పెద్దారవీడు మండలంలో 26 పాఠశాలల్లో 39 తరగతి గదులు, పెద్దదోర్నాల మండలంలో 28 పాఠశాలల్లో 65 తరగతి గదులు నిర్మాణంలో ఉన్నాయి. నిధులు మంజూరైన పాఠశాలల్లో నిధులు కేటాయించిన వరకు గుత్తేదారులు, ప్రధానోపాధ్యాయులు ఖర్చు చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వరకు అన్ని ఖర్చు అయిపోయాయి. దీంతో నిర్మాణ పనుల కోసం నిల్వ చేసిన ఇనుము, ఇసుక, కంకర, ఇతర సామగ్రి పాఠశాల ఆవరణల్లో విద్యార్థులకు అడ్డుగా ఉండటంతో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కొన్ని చోట్ల పనులు నెలల తరబడి ఆగిపోవడంతో ఇసుక, కంకర అంతా మట్టిలో కలిసిపోయాయి. మరి కొన్ని పాఠశాలల్లో అయితే నాడు-నేడు పనులతో ప్రార్థన సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో అయితే పాత తరగతి గదులను పడకొట్టి నూతన గదులను నిర్మాణం చేయడం కోసం ఖాళీ చేయడంతో నిర్మాణాలు పూర్తయ్యే వరకు వరండాలు, చెట్ల కింద తరగతులు కొనసాగిస్తున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పనులు జరిగే పరిస్థితి కనిపించడంలేదు. వచ్చే విద్యా సంవత్సరంలోనైనా నూతనంగా ఏర్పడమే పభ్రుత్వమైనా పనులు త్వరగా పూర్తి చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



పాఠశాలల్లో నత్తనడకగా సాగుతున్న నాడు నేడు పనులు

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనంపై వివాదం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో పోలీసులు స్వాదీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నారు. మూడు రోజుల క్రితం జువ్వలపాలెంకు చెందిన రెండు ట్రాక్టర్ల వద్ద సరైన బిల్లులు లేకపోవడంతో అదులుపులోకి తీసుకుని తహాశీల్దారుకు పోలీసులు అప్పగించారు. దీనిపై మైనింగ్ అధికారులకు సొమ్మును చెల్లింపు చేసుకొని ట్రాక్టర్లను విడుదల చేసేందుకు మూడు రోజుల నుండి చలానా రాసి కూడా టాక్టర్లను అట్లాగే ఉంచారు. ఈ విషయాన్ని ఎంపీపీ, జడ్పీటీసీలు తహాశీల్దారు దృష్టికి తెచ్చారు. చలానా కట్టించుకుని ట్రాక్టర్లను వదిలిపెట్టాలని కోరారు. తహాశీల్దారు స్పందించకపోవడంతో బుధవారం వైసిపి ఇన్చార్జి వరకూ అశోక బాబు జోక్యం చేసుకుని రసీదులు రాసి సొమ్మును తీసుకుని ఎందుకు విడుదల చేయటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉండగా పార్టీ అభ్యర్థి తహాశీల్దారు కార్యాలయానికి రావడాన్ని ఓ విలేకరి ఫోటో తీశాడు. దీంతో ఫోటో దేనికి తీస్తున్నావని అతన్నీ ప్రశించారు. ఎన్నికల కోడలు అమలు వండగా మీరు ఎందుకు వచ్చారంటూ విలేఖరి ఎదురు ప్రశ్నించగా ఇరువురి మధ్య వాగ్వివాదం నెలకొంది. అక్కడున్న కొందరు సర్ది చెప్పి విలేకరిని అక్కడ నుండి పంపించి వేశారు. ఈ విషయం మండలంలో తీవ్ర చర్చనీయాంశమైంది.


అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్

నవరత్నాల పేరుతో మోసం

ప్రజాశక్తి - పీవీ పాలెం

నవరత్నాల పేరుతో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎం షరీఫ్ ఆరోపించారు. చందోలులోని నియాజీ గృహంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, అరాచకాలు గతంలో ఎన్నడూ జరగలేదని అన్నారు. ముస్లీం మైనార్టీల అభ్యున్నతికి టీడీపీ అధినేత చంద్రబాబు ఎంతో కృషి చేశారని అన్నారు. 40ఏళ్లుగా ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న తాను ఇప్పటి వరకు అందరు ముఖ్యమంత్రుల పాలన చూశానని అన్నారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలు ఎప్పుడూ జరగలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి సీఎం అయిన తరువాత రాజకీయాలకు అర్థాలు మార్చేశాడని అన్నారు. నేడు రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలిపిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వ్యాపార సంస్థలు, పరిశ్రమలు ఏవీ రాష్ట్రానికి రాని పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు 70శాతం పూర్తి చేస్తే వైసీపీ 5ఏళ్ల పాలనలో కాలయాపన చేశాడే గానీ ప్రాజెక్టు పూర్తి కాలేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయం సస్యశ్యామలంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, జనసేన ఇన్‌ఛార్జి నామన శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.


రథోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసిల్దార్

రథోత్సవం ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక భ్రమరాంబ మల్లేశ్వర స్వామి రథోత్సవం కార్యక్రమం ఈనెల 24న జరగనుంది. రథోత్సవానికి తగిన ఏర్పాట్లను తహాశీల్దారు ఐ మునిలక్ష్మి, ఎంపీడీఒ మల్లికార్జునరావు, ఎస్ఐ శ్రీనివాసరావు సమక్షంలో బుధవారం పరిశీలించారు. రథోత్సవానికి భట్టిప్రోలు తదితర ప్రాంతాల నుండి ప్రజలు విరివిగా వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే రథోత్సవానికి పంచాయతీ, రెవిన్యూ, పోలీస్ శాఖల అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు సిద్ధం చేయాలని దేవస్థాన కమిటీని కోరారు. ఆమే వెంట దేవస్థానం ఈఒ దివి అప్లాచార్యులు, దేవస్థాన కమిటీ సభ్యులు, పద్మశాలీయ సంఘీయులు ఉన్నారు.



టిడిపిలో చేరిన దళిత నాయకులు శీలం రోషన్ బాబు

టిడిపిలోకి దళిత నేత రోషన్‌బాబు

ప్రజాశక్తి - బాపట్ల

దళిత బహుజన ఉద్యమ నాయకుడు, మాల మహానాడు అధికార ప్రతినిధి శీలం రోషన్ బాబు, దళిత నాయకులు దుడ్డు ప్రసన్న బాబు తమ అనుచరులతో బాపట్ల నియోజకవర్గం టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ సమక్షంలో టిడిపిలో బుధవారం చేరారు.

పడకేసిన తాగునీటి పథకం

- ముందుకు సాగని పనులు
- ప్రజలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

ప్రజల నీటి కష్టాలను తీర్చేందుకు ప్రవేశపెట్టిన ఇంటింటికీ తాగు నీటి కుళాయి పథకం అధికారులు,కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రారంభానికి నోచలేదు. దీంతో మండల పరిధిలోని పలు కాలనీల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. సిఎస్పురంలోని పాములవారి కాలనీ, రహమత్ నగర్, ఎస్సికాలనీల ప్రజల నీటి కష్టాలు తీర్చేందుకు ఇంటింటికి నీటి కొళాయి పథకాన్ని మంజూరు చేశారు. ఈ పథకం ద్వారా ఆయా కాలనీలలో పైపులు వేసి ఇంటింటికీ నీటి కొళాయి బిగించి తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి ఆయా కాలనీలకు నీటి సరఫరా చేయాల్సి ఉంది.మూడు నెలల క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మధ్యలో పనులు నిలుపుదల చేశాడు. పనులు పూర్తి చేయించాల్సిన ఆర్డబ్ల్యుఎస్ అధికారులు తమకు సంబంధం లేనట్లుగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు.

పనులు ప్రారంభించక ముందు పాముల వారి కాలనీలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

కొళాయిలను కాంట్రాక్టర్ ధ్వంసం చేశాడు. దీంతో ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. ట్యాంకర్ ద్వారా సరఫరా చేసే నీటి కోసం ఎదురు చూడాల్సి వస్తుందని పాములవారి కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మినీ ట్యాంకులకు నీటి కనెక్షన్ తొలగించారని దీంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని రహమత్ నగర్ కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటింటికీ నీటి కుళాయి పథకం పనులను పూర్తి చేసి తమకు నీటి కష్టాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు తర్వగా పూర్తి చేయాలి

నాగమ్మ, పాముల వారి కాలనీ



ఇంటి కుళాయి పథకం పనులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి. గతంలో ఉన్న కుళాయిలు తొలగించారు. ఇంటింటికీ పథకం కుళాయి పనులు మధ్యలో ఆపేశారు. అధికారులు స్పందించి ఇంటింటికీ కుళాయి పథకం పనులను పూర్తి చేయించి తాగునీటి ఇక్కట్లు లేకుండా చూడాలి.

నీటి కోసం అవస్థలు

నరసింహులు, పాముల వారి కాలనీ



గతంలో పంచాయతీ ఆధ్వర్యంలో కాలనీలో కుళాయిలు ఏర్పాటు చేశారు. ఇంటింటికీ కుళాయి పథకం పనలు ప్రారభించినప్పుడు ఆ కుళాయిలను తొలగించారు. ఇంటింటికీ కుళాయి పథకం పనులు పూర్తికాలేదు. దీంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు.

వడదెబ్బ నివారణపై అవగాహన

ప్రజాశక్తి- ఒంగోలు

ప్రభుత్వ వైద్యకళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు వడ దెబ్బ నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మంగమూరు డొంక పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి శివప్రసాదర్ కాలనీ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా ప్రబుత్వ ఆర్యోగ శాఖ దీర్ఘకాలిక ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భగీరధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి. తిరుమలరావు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుమల రావు మాట్లాడుతూ 40 డిగ్రీల కంటే ఎక్కువ ఎండ తీవ్రతకు లోనైతే వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు వడదెబ్బకు గురికాకుండా ఉంటేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, డాక్టర్ సత్యశ్రీ, డాక్టర్ ప్రేమ, వెంకటేశ్వరుల, రవికుమార్, హౌస్ సర్జన్లు డాక్టర్ అభిజిత్, డాక్టర్ తేజ, డాక్టర్ వినోద్, డాక్టర్ అనిల్, ఆషా వర్కర్లుపాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పొదిలి

ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సిడిపిఒ సుధ మారుతి తెలిపారు. ఓటర్లకు అవగాహన కల్పిస్తూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ ప్రజలు తమకు నచ్చిన వారికి నిర్భయంగా ఓటేయాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి విశ్వనాథపురం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ శోభరాణి, అంగన్వాడీలు, ప్రజలు పాల్గొన్నారు.

18 సంవత్సరాలు దాటిన యువతీ యువకులు తమ ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని ఉపాధి హామీ పథకం అధికారి గడ్డం రాంబాబు తెలిపారు. మరిపూడి మండలం రేగలగడ్డ గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో చాలా మంది ఉపాధి కూలీలలో ఉపాధి పనులు చేస్తే బిల్లులు చెల్లిస్తారో లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు తెలిపారు.ఎన్నికల హామీ పనులకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పోలీసు కవాతు

ప్రజాశక్తి -మార్కాపురం రూరల్

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని డిఎస్పి బాల సుందర్ రావు కోరారు. మండల పరిధిలోని పెద్దనాగులవరం గ్రామం నందు కేంద్ర, రాష్ట్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛందగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. గొడవలు సష్టించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటన

హనుమంతునిపాడు : మండల పరిధిలోని వేములపాడు, లింగంగుంట్ల సచివాలయాల పరిధిలో వైసిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ బుధవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గాయం బలరాం రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి, భవనం కష్ణారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సచివాలయాల కన్వీనర్ మద్ది తిరుపతయ్య, వైస్ ఎంపిపి కొదమల బెంజిమెన్, ఎంపిటిసి నారాయణస్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కస్తాల బాలాజీ, సోషల్ మీడియా కన్వీనర్ రామకష్ణ, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు గొడుగులు పంపిణీ

కనిగిరి : మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపాలెం ఎస్సికాలనీ అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు బుధవారం గొడుగులు పంపిణీ చేశారు. దాత గ్రంధి శ్రీకాంత్, లక్ష్మి ప్రతిమల కుమారుడు సాయి నికేతన్ పేరుతో చిన్నారులకు గొడుగులు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ పసుపులేటి అరుణోధర్, కార్యదర్శి మారెళ్ళ ఉమాకాంత్, కోశాధికారి వాగిచర్ల వెంకటేశ్వర్లు, అంగన్వాడీ సూపర్ వైజర్ సుమతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనివాసరావుకు వీడ్కోలు

యర్రగొండపాలెం : వంద పడకల ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు ఉన్నత విద్యనభ్యసించేందుకు వెళ్తున్నారు. అందులో భాగంగా ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో శ్రీనివాసరావుకు బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివారావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్రావు, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ వెంకయ్య, డాక్టర్ రాంజీ నాయక్, డాక్టర్ సూర్య ప్రకాష్, డాక్టర్ చంద్రేఖర్, డాక్టర్ కోటా నాయక్, డాక్టర్ నాయబ్ రసూల్, డాక్టర్ ముబినా, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ చైతన్య, సూపరింటిండెంట్ సుధీర్, హెడ్ నర్సు ఫ్లోరి పాల్గొన్నారు.

మల్లికార్జున రావుకు నివాళి

పెద్దదోర్నాల : చిలకలూరిపేట వద్ద ఇటీవల నిర్వహించిన ప్రజాగళం సభకు వెళ్లి తిరిగి వస్తూ పెద్దదోర్నాలకు చెందిన రామడుగు మల్లికార్జున వినుకొండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయడ్డాడు. వైద్యచికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న టిడిపి యర్రగొండపాలెం నియోజక వర్గ ఇన్ఛార్జి గూడూరి ఎరిక్షన్బాబు బుధవారం మల్లికార్జున మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో టిడిపి మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, మాబు, వీరారెడ్డి, సుబ్బరత్నం ఉన్నారు.



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

'మనఊరుకి మన శివన్న'

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండల పరిధిలోని తూర్పు గంగవరం, రామభద్రాపురం గ్రామాల్లో మన ఊరికి, మన శివన్న కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి దర్శి నియోజక వర్గ అభ్యర్థి బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి స్థానికులకు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి నందిని, పిఎసిఎ చైర్పర్సన్ యల్లమందారెడ్డి, యోగిరెడ్డి, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జె.శ్రీనివవాసరావు, వైసిపి మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, మధుసూదరెడ్డి, రామిరెడ్డి, మోషే తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కరెడ్డి

పేదల సంక్షేమానికి కృషి : చెవిరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సెవెన్హిల్స్ హోటల్ లో వైసిపి కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మాట్లాడుతూ చెప్పినవీ చేశాం... చెప్పనవీ చేశామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేశామన్నారు. గతంలో హామీ ఇవ్వని ప్రభుత్వ మెడికల్ కళాశాల రూ. 475 కోట్లతో నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మార్కారం నియోజక వర్గ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు, వైసిపి యర్రగొండపాలెం అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్, ఎపిఐఐసి చైర్మన్ జంకె వెంకటరెడ్డి, ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్అలిబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, వైసిపి పట్టణ కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కెపి. కొండారెడ్డికి పరామర్శ

చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాజీ ఎమ్మెల్యే కెపి.కొండారెడ్డిని ఆయన నివాస గృహంలో పరామర్శించారు.ఈ సందర్భంగా కొండారెడ్డి ఆరోగ్య విషయం గురించి ఆయన కుమారుడు కుందురు కృష్ణమోహన్రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-దర్శి

రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల నియమావళిని తూచా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోటేశ్వరరావు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల నియామావళిలపై అగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రచారం నిర్వహించేందుకు నాయకులు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు నరేంద్ర, టిడిపి నాయకుడు వెంకటేశ్వర్లు, బిజెపి నాయకుడు శ్రీనివాసరావు, సిపిఐ నాయకుడు కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొండారెడ్డి, తహశీల్దారు సుజాత, డిటీలు రవిశంకర్, శివ ప్రసాద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నప్రాసన దృశ్యం

చిన్నారులకు పౌష్టికాహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - బాపట్ల

అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని అందించి చిన్నారుల పట్ల అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈతేరు పంచాయతీ సర్పంచి దమ్ము మార్తమ్మ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా బాపట్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు అప్పికట్ల సెక్టార్ పరిధిలోని ఈతేరు గ్రామ అంగన్‌డీ కేంద్రంలో పోషణ పక్వాడ వేడుక బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అన్నప్రాసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, చిన్నారులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని సకాలంలో అందించి వారి ఆరోగ్య పరిరక్షణకు అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అప్పికట్ల సెక్టార్ సూపర్వైజర్ కె కుమారి, ఈతేరు అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త కె గీత, సచివాలయ ఎఎన్‌ఎం ఉష, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎస్‌సి సెల్ అధ్యక్షులు పి రాంబాబు

వైసిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి - యద్దనపూడి

అనారోగ్య కారణంగా ఒంగోలు రిమ్స్ లో చికిత్స పొందుతున్న యద్దనపూడి గ్రామానికి చెందిన పల్లెపోగు మార్తమ్మను వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు పాలెపోగు రాంబాబు బుధవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సాయం అందించారు. ఆయనతో పాటు జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షులు కొల్లా వెంకట్రావు, సీనియర్ నాయకులు జంపని కోటి, పర్చూరు ఎఎంసి వైస్ చైర్మన్ గాజుల రమేష్, పాలెపోగు పవన్ పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన నాయకులతో నరేంద్ర వర్మ

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని బేతపూడికి చెందిన 20 మంది నాయకులు, కార్యకర్తలు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముక్కాముల సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి గుడిపల్లి, మాజీ అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి, నాయుడు శ్రీనివాసరెడ్డి, కోట సాయిబురెడ్డి, కోట పుల్లారెడ్డి, నాయుడు కృష్ణరెడ్డి పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - వేటపాలెం

చేనేతల ఆర్థిక అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టిడిపి సీటు ఆశిస్తున్న తిరువీధుల శ్రీనివాసరావు తెలిపారు. ఓడరేవు, కావూరువారిపాలెం, మున్సిపాలిటీ, వేటపాలెం చేనేతపురి, కొంజేటి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రానున్న ఎన్నికల్లో తాను పోటీలో ఉంటానని తెలిపారు. బీసీ చేనేత సామాజిక వర్గానికి చెందిన తనకు చేనేత సమస్యల పట్ల అవగాహన ఉన్నదని పేర్కొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనం ప్రజాస్పందన

సమావేశంలో ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

జగన్ అవినీతి పాలనపై ప్రజల వ్యతిరేకతకు నిదర్శనమే ప్రజాగళం సభకు హాజరైన ప్రజా స్పందనని ఎంఎల్ఎ అనగాని సత్య ప్రసాద్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల చిలకలూరి పేటలో జరిగిన ప్రజాగళం సభకు వచ్చిన జన సందోహన్ని చూస్తే ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుందని అన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో ప్రజలు ఎంత విసుగు చెందారో, ఎంత అణిచివేతకు గురయ్యారోనని అన్నారు. ప్రజల్లో తిరుగుబాటు వచ్చిందనడానికి ప్రజగళం సభ నిదర్శనం అన్నారు. పోలీసుల వైఫల్యంతో జాతీయ రహదారిపై ఇరువైపులా 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచి ఇబ్బందులు పడ్డారని అన్నారు. అనేక మంది కిలో మీటర్ల దూరం నడుచుకుంటూ సభా వేదికకు వచ్చారని అన్నారు. 15ఏళ్ల తర్వాత లారీలు, ట్రాక్టర్లపై ప్రజలు సభకు రావడం చూశానని అన్నారు. సిద్ధం సభల పేరుతో అధికార వైసిపి వాలంటీర్ల సహకారంతో సంక్షేమ పథకాలు ఆపేస్తామని, పింఛన్లు నిలిపేస్తామని, నివేసిన స్థలాలు పొందిన లబ్ధిదారుల పట్టాలను రద్దు చేస్తామని బెదిరించి జనాన్ని సమీకరించారని ఆరోపించారు. వాలంటరీలు ప్రజాహితం కోసం పని చేయాలి కానీ పార్టీల కోసం కాదని చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ప్రభుత్వ అధికారులు పనిచేయాలని అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, పంతాన్ని మురళీధరరావు, వెనిగల్ల సుబ్రమణ్యం, టిడిపి రైతు నాయకులు మేక శివరామకృష్ణ, ధర్మ తేజ పాల్గొన్నారు.



సమావేశంలో ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్

దళిత ఐక్యవేదిక పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రేపల్లె

.దళితులందరూ ఐక్యంగా ఉండాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. దళితుల ఆత్మీయ సమావేశం పోస్టర్స్ బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 24న క్లాత్ మర్చంట్స్ హల్ నందు నియోజవర్గ స్థాయి దళితుల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. దళితుల ఐక్యవేదిక నాయకులు దారం సాంబశివరావు, జుల్లకంటి బుజ్జి మాట్లాడారు. 45వేల ఓటర్లతో నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఉన్న దళితుల ఐక్యత కొరకు, భవిష్యత్తులో అన్ని రంగాల్లో దళితుల అభివృద్ధి కొరకు ఒక వేదికగా ముందుకు వెళ్ళడానికి, దళితుల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, అంబేద్కర్, బాబూజగ్జీవన్ రామ్ యువజన సంఘాలు, దళిత ఎంప్లాయిస్ ఫెడరేషన్స్ దళితుల ఆత్మీయ సమావేశంలో ఎస్సి మాదిగ, మాలల ఐక్యత కొరకు, దళిత గ్రామాల అభివృద్ధి కోరకు, కీలక పదవుల్లో దళితులకు రాజకీయ ప్రాధన్యత ఓట్లు సంఖ్య ప్రకారం పెరిగే లా ఉమ్మడిగా చర్చించి ముందుకు వెళ్ళతామని అన్నారు. దళితుల హక్కుల సాధనకోసం, ఐక్యత, అభివృద్ధి, సమానత్వం కోసం జరిగే ఆత్మీయ సమావేశానికి అందరు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు జి ప్రశాంత్, ఎం సుధా చంద్రహాసన్, కొన శ్రీను, నాగేశ్వరరావు, కె సజ్జనరావు, ఎ నాగేశ్వరరావు, కె ప్రతాప్, ఎ కిరణ్, జి కుమార్, సిహెచ్ మణిలాల్, కె మస్తాన్, రామారావు, టి శ్యామ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దళిత నేతలు

చీరాలను అభివృద్ధి చేస్తా : వెంకటేష్

ప్రజాశక్తి - చీరాల

సమస్యల పరిష్కారానికి కృషి చేసి.. చీరాలను అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తానని వైసీపీ ఎంఎల్ఎ అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. మండలంలోని దేవినూతల లోని అంకమ్మ గుడిలో పూజల అనంతరం తన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. వైసిపి ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిందని అన్నారు. నియోజకవర్గ ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రశాంత వాతావరణం కల్పించినట్లు చెప్పారు. చీరాల పట్టణంతోపాటు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు ఆసాది అంకళరెడ్డి, వేటపాలెం అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, చీరాల పట్టణ అధ్యక్షులు కొండ్రు బాబ్జీ, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లీ వైష్ణవి, మల్లెల లలిత రాజశేఖర్, యువజన రాష్ట్ర అధ్యక్షుడు యాతం మేరిబాబు, సేవదళ్ రాష్ట్ర సెక్రటరీ గోలి గంగాధర్, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యులు పులి వెంకటేశ్వర్లు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు చీమకుర్తి బాల కృష్ణ, వైసిపి జిల్లా కార్యదర్శి బండారు శివపార్వతి, సల్లూరి అనిల్, ఆర్బికె చైర్మన్లు కావూరి రమణరెడ్డి, పల్లపోలు శ్రీనివాసరావు, జేసీఎస్ ఇంచార్జీ బుర్ల సాంబశివరావు పాల్గొన్నారు.



దేవినూతల నుండి వైసీపీ అభ్యర్థి వెంకటేష్ ప్రచారం

వ్యాపారులతో పాలేటి సమావేశం

ప్రజాశక్తి - చీరాల

టిడిపి అభ్యర్ధిని చంద్రబాబు ప్రకటించనున్న నేపథ్యంలో మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ఎంజిసి మార్కెట్‌లోని వస్త్ర వ్యాపారులతో మాట్లాడారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు, కామధేను కాంప్లెక్స్ అధ్యక్షులు తులాబందుల సురేష్, పెనుగొండ కిషోర్, ఎక్కల శివ మోహనరావును కలిసి వారిషాపు వద్ద సమావేశం అయ్యారు. దుకాణదారులతో ఆయన మాట్లాడారు. ఆయన వెంట తేలప్రోలు వెంకటేశ్వర్లు, పువ్వాడ రామకృష్ణ, శవనం నాగేశ్వరరెడ్డి, కామినేడి రామకృష్ణ, ఆసాది అంజిరెడ్డి, బొమ్మిడి నాగరాజు, కీర్తి కృష్ణ, గవిని మణి, కొమ్మన బోయిన సుబ్బారావు, బిజెపి నాయకులు తడవర్తి చంద్ర పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న డాక్టర్ పాలేటి రామారావు



వైసిపి కార్యాలయం ప్రారంభిస్తున్న వైస్‌చైర్మన్ సుజ్ఞానమ్మ

వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పార్టీలకు అతీతంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ అన్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైసీపీ కార్యాలయాన్ని వైసిపి అభ్యర్థి యడం బాలాజీ సోదరుడు దీపక్‌తో కలిసి ఆమె బుధవారం ప్రారంభించారు. పేదలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ప్రగతి పదం వైపు నడుస్తుందని అన్నారు. సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మళ్ళీ వైసిపిని అధికారంలోకి తేవడానికి కార్యకర్తలు నిజాయితీగా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సుమితా భాయి, రాజానాయక్, ఎంపిపి భూక్యా శాంతి భాయి, బాబు నాయక్, వైసిపి మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, వైసిపి నాయకులు కాకోలు రామారావు, గర్నెపూడి రవిచంద్, అట్లూరి సుగుంధరావు, సులేమాన్ పాల్గొన్నారు.



టీ తయారు చేస్తున్న హనిమిరెడ్డి

హనిమిరెడ్డి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - అద్దంకి

ప్రజలకు దగ్గర అయ్యేందుకు ఎన్నికల ప్రచారంలో కొత్త పద్ధతులు కనిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ రాకముందు ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొని ప్రచారం నిర్వహించిన అధికార పార్టీ నేతలు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కొత్త తరహా ప్రచారం మొదలు పెట్టారు. వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి శుభోదయం అద్దంకి, మీలో ఒకడిగా హనిమిరెడ్డి అంటూ భిన్నమైన పేర్లతో ప్రచారం చేస్తున్నారు. ఉదయం గ్రౌండ్లో వాకింగ్ చేస్తున్న వారిని పలకరిస్తున్నారు. టీ కొట్ల దగ్గర టీ తాగుతూ ఓటు అభ్యర్థిస్తున్నారు. టిఫిన్ హెూటల్స్, కూరగాయలు మార్కెట్లు, బస్టాండ్ దగ్గర వివిధ షాపులను సందర్శిస్తూ ప్రచారం చేస్తున్నారు. కొత్త తరహాగా ఉందని పలువురు చర్చించు కోవడం కనిపించింది.

కొణికిలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని కొణికి చెందిన దావులూరి రాఘవయ్య (70) మృతి చెందగా కుటుంబ సభ్యులు నేత్రదానం చేయనున్నట్లు రోటరీ అవయవ దాన కమిటీకి సమాచారం అందించారు. దీంతో గుంటూరు శంకర కంటి వైద్యులకు సమాచారం ఇవ్వటంతో వైద్యులు కొణికి వచ్చి కార్నియాలు సేకరించారు. నేత్రదానం చేసినందుకు రాఘవయ్య భార్య భూషమ్మ, కుమారుడు రామాంజ నేయులు, కోడలు నాగలక్ష్మిలకు రోటరీ సభ్యులు సోమేపల్లి రామ్మోహన్‌రావు, జట్టి వెంకటేశ్వర్లు (స్వామి), క్లబ్ అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, ట్రెజరర్ సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. 542వ నేత్రదానం జరిగిందని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. నేత్రదానం చేయడమంటే చనిపోయిన తర్వాత కూడా మరొకరికి వెలుగును ఇవ్వడమేనని అన్నారు. నేత్ర దానం ప్రోత్సహించాలని కోరారు.



దావులూరి రాఘవయ్య

పూడిపోయిన పంట కాలువ

నీళ్లు అందక రైతుల ఆందోళన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సాగునీటి ప్రధాన కాలువ పూడిపోవడంతో నీళ్లు పూర్తిస్థాయిలో పొలాలకు చేరక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని అద్దేపల్లి గ్రామం వద్ద వెల్లటూరు ఛానల్ నుండి పిల్ల కాలువ (సాగునీటి) సుమారు 500 ఎకరాలకుపైగా సాగునీరు అందిస్తుంది. ఐలవరం సమీపంలోని అల్లూరు కాలువగా పిలవబడే ములుగు కాలువలో కలుస్తుంది. ఈ కాలువ అద్దేపల్లి, ఐలవరం గ్రామాలను కలిపి డొంక రోడ్డు నుండి సుమారు 300 మీటర్లకుపైగా పూడిపోయింది. నీరు పారే అవకాశం లేక అ డొంక పక్కనే ఉన్న పతుల్లో పొలాల్లో నీరు బయటకు వెళ్లి మురుగు కాలువలో కలుస్తుంది. నేరుగా వెళ్లాల్సిన కాలువ పూడిక కారణంగా నీరంతా పంట పొలాలకు పూర్తిస్థాయిలో చేరకుండా మురుగు కాలువలో


పూడిపోయిన పంట కాలువ

కలిసిపోవడంతో ఆ ప్రాంతంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం నుండి పూడిపోయిన ఈ కాలువతో ఇరు ప్రాంతాల రైతులు ఉన్న కాలువ కట్టలను కూడా పంట పొలాల్లో కలిపేసుకుని ఆక్రమించు కుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కాలువ పూడిపోయిన ప్రాంతం పూర్తిగా బళ్ళు తిరిగే డొంక రోడ్డుగా మారిందని, దీనిని అధికారులు సర్వే చేయించి సంబంధిత ఇరిగేషన్ అధికారులు చొరవచూపి కాలువను తవ్విస్తే ఆ ప్రాంతంలోని పొలాలకు సాగునీరు ఇబంది లేకుండా ఉంటుందని రైతులు కోరుచున్నారు. పంట కాల్వలో నీళ్ల మురుగు కాల్వలో కలవడంతో అవసరమైన సమయంలో ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని పంట పొలాలకు నిప్పుకోవాల్సిన దుస్థితి ఏర్పడు తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు ఉన్నతాధికారులకు గతంలో ఉన్న నీటి సంఘాల సభ్యులకు తెలియపరచినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సమస్య కొనసాగుతూనే ఉందని రైతుల వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం వేసవికాలం దృష్ట్యా సాగునీరు విడుదల సమయానికి ఈ ఏడాదైనా పూడిపోయిన పిల్ల కాలువను సంబంధిత అధికారులు చొరవ చూపి పూడికతీత చేపట్టి రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

మదర్సా నిర్మాణం పేరుతో మోసం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘానికి చెందిన అద్దేపల్లి గోడౌన్ ప్రాంతాన్ని అక్రమంగా ఆక్రమించుకొని దానిని ధ్వంసం చేసి ఆ ప్రాంతంలో మదర్స నిర్మాణం చేపడుతున్నామని వైసిపి నాయకులు ముస్లిం ప్రజలను నమ్మించి మోసం చేశారని ఆ ప్రాంత ముస్లిం సోదరులు ఆరోపిస్తున్నారు. ఈ స్థలం సొసైటీకి సంబంధించినదేనని కోర్టు ఆదేశాలతో పరిశీలన చేపట్టిన లోకాయుక్త డిఎస్పి సుబ్బారెడ్డి నిర్ధారించారు. ఈ స్థలం సొసైటీకి సంబంధించినది కాదని తమ పూర్వీకుల స్థలమని, దీనిలో మదర్సా నిర్మిస్తున్నామని, ప్రజలందరికీ ఉపయోగపడుతుందని, తమకు సందాలు ఇవ్వండని, చెప్పి లక్షలాది రూపాయలు తమ నుండి వసూళ్లు కూడా చేసి మమ్మల్ని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవిత్రమైన మదర్సా నిర్మాణాన్ని అడ్డం పెట్టుకొని


సొసైటీ ఆక్రమిత స్థలంలో నిర్మించిన బేస్మెంట్

నాయకులు వారి స్వార్ధ ప్రయోజనాల కోసం ఊరురా తిరిగి ముస్లిం సోదరుల వద్ద నిర్మాణం పేరుతో రూ.లక్షలు వసూలు చేసి స్వాహా చేయటమే కాక ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించి తమను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు జకాతు, పిత్రా వంటి దానాలు ఇస్తూ ఉంటారని అన్నారు. దీనిని ఆసరా చేసుకొని గత రంజాన్ మాసంలో ఈ వసూళ్లు చేపట్టారని, దీంతో మరి కొంత మంది దాతలు అందించిన ఇనుము, సిమెంటు, కంకర వినియోగించుకొని ఆక్రమిత స్థలంలో బేస్మెంట్ నిర్మాణం చేపట్టి ఎంత వసూలు చేశారో ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచి తమను మోసం చేశారని అద్దేపల్లి ముస్లిం సోదరులు ఆరోపించారు. ఇది సొసైటీ స్థలమని, వివాదాల్లో ఉంది కాబట్టి దీనిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టి ఇబ్బందులు పడరాదని నాయకులకు సూచించినప్పటికీ పట్టించుకోకుండా నిర్మాణం చేపట్టడానికి సిద్ధపడ్డారని వ్యాఖ్యానిస్తున్నారు. ముస్లిం సోదరులను రంజాన్ మాసంలో మోసం చేసిన అధికార వైసిపి నాయకుల ఆగడాలను ప్రతి ముస్లిం సోదరుడు గమనించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.


విద్యుత్తు కార్యాలయంలో తొలగించని పోస్టర్లు

నిబంధనలు తూచ్

ప్రజాశక్తి - అద్దంకి

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు అన్నీ తొలగించారు. శిలాఫలకాలపై సిఎం, ఇతర మంత్రులు, ఎంఎల్ఎల పోస్టర్లు ఉండటంతో వాటినీ కనిపించకుండా పేపర్లు అంటించారు. నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ అధికారులు ఎన్నికల నియమావళిని అమలు చేస్తుంటే అద్దంకిలో మాత్రం గాలికి వదిలేశారు. సింగరకొండ రోడ్డులోని విద్యుత్తు కార్యాలయంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫోటోలతో రైతులకు సంబంధించిన విద్యుత్తు అంశాలపై ప్రభుత్వం ప్రచురించిన గోడ పత్రికను తొలగించకుండా అలాగే ఉంచారు. ఈ గోడపత్రిక చూసిన ప్రజలు విద్యుత్ అధికారులకు నియమావళి వర్తించదాని ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ డిఈ, ఎడిఈ, ఎఈలు గతంలో అనేకసార్లు విద్యుత్ స్థంభాల సమస్య పరిష్కరించాలని కోరినప్పటికీ పరిష్కరించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల నియమావళి వచ్చిన అనంతరం కొందరి మెప్పుకోసం విద్యుత్ అధికారులు తమ ఇష్టం వచ్చిన రీతిలో స్తంభాలు కొత్తవి అమర్చడం, వైర్లు బిగించడం వంటి చర్యలు చేపడుతున్నారని పట్టణ ప్రజలు చర్చిస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు నిష్పక్ష పాతంగా పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

వసతి గృహానికి ఆర్థిక సహకారం

ప్రజాశక్తి - బాపట్ల

స్వాతంత్యానికి పూర్వమే వ్యవసాయ విద్యకు బీజం వేసిన బాపట్ల వ్యవసాయ కళాశాల్లో వ్యవసాయ విద్యను అభ్యసించడం ఎంతో గర్వకారణమని పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. కళాశాల్లో 1967–71బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల్లో నిర్మితం అవుతున్న పూర్వ విద్యార్థుల వసతి గృహానికి ఆలమ్ని అగ్రికల్చరల్ గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్ ఫర్ కాలేజ్ డెవలప్ మెంట్ ఆధ్వర్యంలో రూ.10లక్షల 41వేల116 విరాళాన్ని చెక్కు రూపంలో కళాశాల అసోసియేట్ డీన్ వి శ్రీనివాసరావుకు అందజేశారు. పూర్వ విద్యార్థులు కళాశాల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. అసోసియేట్ డీన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్రాంతి గృహం భవన సముదాయం కింద భాగం ఫిబ్ర


చెక్కు అందిస్తున్న వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థులు

వరి 11న ప్రారంభించినట్లు తెలిపారు. మొదటి అంతస్తులో 12 గదుల నిర్మాణం జూన్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థులు ఎం భాస్కరరావు, కె భాస్కరరావు, ఎం రమాదేవి, సౌభాగ్యలక్ష్మి, సిహెచ్ శ్రీనివాసరావు, వై సాంబశివరావు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - బాపట్ల

పదోతరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలు మూడోరోజు బుధవారం ఆంగ్ల పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. 108 పరీక్షా కేంద్రాల్లో 16952మంది విద్యార్థులకు 16424 మంది హాజర య్యారు. 528మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డిఇఒ కె నారాయణరావు తెలిపారు. పరీక్షలకు 97శాతం విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. జిల్లా పర్యవేక్షణ అధికారి, డైరెక్టర్ ఆఫ్ టెక్స్ బుక్స్ రవీంద్ర నాథరెడ్డితోకలసి తాము పరీక్షాకేంద్రాలు తనిఖీ నిర్వహించామని అన్నారు. డిప్యూటి డిఇఒలు, ఫ్లెయింగ్ స్క్వాడ్, పోలీస్ అధికారులు పరీక్షాకేంద్రాల తనిఖీల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

పర్చూరు : పరీక్ష కేంద్రాలను రవీంద్రనాద్‌రెడ్డితో కలిసి


పరీక్షా కేంద్రాల్లో తనిఖీ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఎంఇఒ పర్యవేక్షించారు. బుధవారం ఇంగ్లీషు పరీక్షకు 14మంది గైర్హాజరైనట్లు ఎంఇఒ ఎం సత్యనారాయణ, పి వెంకట్రామయ్య తెలిపారు. నాలుగు కేంద్రాల్లో 720 మందికి 708మంది పరీక్ష రాసినట్లు తెలిపారు.


భట్టిప్రోలు నుండి 50 మంది టిడిపిలో చేరిక

టిడిపిలో చేరిన పంచాయతీ సభ్యులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు పంచాయతీలో వైసీపీకి చెందిన పాలకవర్గ సభ్యులు, కొంత మంది వారి అనుచరులతో కలిసి టిడిపిలో చేరారు. 16వ వార్డు సభ్యుడు వంగర వీరయ్య, అతని అనుచరులతోపాటు 50మందికిపైగా వైసీపీలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వాళ్ల టిడిపిలో చేరారు. వీరందరికీ మాజీమంత్రి నక్కా ఆనందబాబు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో పనిచేసేందుకు సిద్ధపడి వైసిపి నుండి టిడిపిలో చేరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ నాయకులు బట్టు మల్లికార్జునరావు, ఎస్సీ సెల్ నాయకులు కనపర్తి సుందర్రావు, టిడిపి మాజీ మండల అధ్యక్షుడు వై కరుణ శ్రీనివాసరావు, మాజీ ఎంపిటీసీ ఎడ్ల జయశీలరావు, గొట్టుముక్కల లేనిన్ ఉన్నారు.

రొటోవేటర్‌లో పడి తెగిపడ్డ రైతు కాళ్లు

ప్రజాశక్తి - అద్దంకి

రైతు పొలంలో ట్రాక్టర్‌తో రోటా వేటర్ పనులు చేస్తున్న సమయంలో డ్రైవర్ గమనిం చకుండా ముందుకు ట్రాక్టర్ నడపడంతో రైతు రెండు కాళ్లు తెగిపడిన ఘటన బుధవారం జరిగింది. మండలంలోని చిన్న కొత్తపల్లి గ్రామానికి చెందిన మానం తిరుపతయ్య అనే రైతు పొలంలో ట్రాక్టర్ రోటవేటర్ పనులు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు వెంటనే క్షతగాత్రున్ని అద్దంకి ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. వైద్యులు సూచనలు మేరకు మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.


గాయపడ్డ తిరుపతయ్య


అగ్ని ప్రమాద బాధితుడిని పరామర్శిస్తున్న నరేంద్ర వర్మ

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని మరుప్రోలు వారి పాలెంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. స్థానిక అగ్నిమాపక అధికారి వై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మున్నం చిన్న కొండలురెడ్డికి చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. సమాచారం తెలుసుకున్న వెంటనే తమ సిబ్బందితో హుటా హుటిన వెళ్లి మంటలు అదుపు చేశామని అన్నారు. సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. సకాలంలో స్పందించి మంటల నుండి కాపాడి మరో రూ.2లక్షల మేర ఆస్తిని కాపాడగలిగినట్లు తెలిపారు. అగ్ని ప్రమాద బాధితుడు మున్నం చిన్న కొండలురెడ్డి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు.

నిబంధనలకు లోబడే విధులు

అధికారులకు అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ ఆదేశం


బాపట్ల సబ్ జైల్‌ను తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బుధవారం అడిషనల్ ఎస్పి టి.పి.విటలేశ్వర్ బాపట్ల సబ్ జైల్‌ను, బాపట్ల పట్టణ, గ్రామీణ పోలీస్ స్టేషన్లను, బాపట్ల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని, ఆర్మడు రిజర్వ్ కార్యాలయాన్ని, ఎమ్.టి కార్యాలయాన్ని సందర్శించారు. చుట్టూ వున్న పరిసరాలను, సిబ్బంది పనితీరును పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో పోలీస్ శాఖ విధులు చాలా కీలకమైనవని, పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ఎవరి విధులు వారు బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం ముఖ్యమన్నారు. సరిహద్దులలోని చెక్‌పోస్ట్‌ల వద్ద ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ అధికారులకు సూచనలు చేశారు.

ఫారం-6 దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తాం..

కలెక్టర్ రంజిత్‌బాషా


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఫారం-6 దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్లో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై ఎలాంటి దరఖాస్తులను స్వీకరించేది లేదని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించడానికి మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాలలో రాజకీయ పార్టీల ప్రచారం ఉండరాదని స్పష్టం చేశారు. హోర్డింగ్, ప్రచార బోర్డులు, గోడపత్రాల ద్వారా ప్రచారం చేయరాదని ఆయన తెలిపారు. మునిసిపాలిటీలలోని హోర్డింగ్ ల ద్వారా రాజకీయ పార్టీల ప్రచారానికి అనుమతులు లేవన్నారు. కేవలం జాతీయ రహదారుల వెంట హోర్డింగ్ లతో ప్రచారం చేసుకోవచ్చన్నారు. ఆర్ ఓ లకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. అన్ని రాజకీయ పార్టీలకు సమానంగా అనుమతులు ఇస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున రూ 50 వేలకు మించి నగదు వెంట తీసుకువెళ్లరాదని స్పష్టం చేశారు. ధ్రువీకరణ పత్రాలు లేకుండా రూ 50 వేలకు మించి నగదు ఉంటే సీజ్ చేస్తామన్నారు. పార్లమెంట్, శాసనసభ ఎన్నికల కోసం ఓటర్ల జాబితా సిద్ధమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా తెలిపారు. గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి నేటి వరకు ఓటర్ల జాబితా సవరణ కొరకు 2,22,48 దరఖాస్తులు వచ్చాయన్నారు. 1,82,400 దరఖాస్తులను ఇప్పటివరకు పరిష్కరించామన్నారు. 36,555 దరఖాస్తులను తిరస్కరించామని, మిగిలిన 3,453 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. మే నెలలో జరగనున్న ఎన్నికలకు యంత్రాంగం సంసిద్ధమవుతోందని తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, బిజెపి నాయకులు కె.వి. రామకష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.రవి, బి ఎస్ పి నాయకులు కె.కోటేశ్వరరావు, సిపిఎం నాయకులు ఎన్ కోటేశ్వరరావు, వైసిపి నాయకులు ఐ మాల్యాద్రి టిడిపి నాయకులు షేక్ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో 'దామచర్ల' ప్రచారం


దామచర్లకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జనం కోసం జనార్ధన్ కార్యక్రమం ఒంగోలు నగరంలోని 31వ డివిజన్ వడ్డె పాలెంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఇంటింటికీ వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్‌లో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేసి తెదేపా అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పి వెంకటేశ్వరెడ్డి , బండారు మదన్, 31వ డివిజన్ వల్లెపు వెంకటేశ్వరావు, రావుల పద్మజ, కుంచాల శ్రీను, జడా సుధాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇస్త్రీ చేస్తూ.. మంత్రి సురేష్ ప్రచారం


ఇస్త్రీ చేస్తున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో బుధవారం నాడు వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైసిపి కొండపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రచారం నిర్వహించారు. ముందుగా మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వైపు ప్రచారం మొదలు పెట్టి.. ఇస్త్రీ చేసే షాపు వద్దకు వెళ్లి.. ఇద్దరు అభ్యర్థులూ ఇస్త్రీ చేస్తూ.. ప్రచారం చేశారు. ఆ తర్వాత బస్సు ఎక్కి ప్రయాణికులతో మాటామంతీ కలిపారు. కూరగాయల షాపు వద్దకి, టీ బంకు దగ్గరకి వెళ్లి.. ప్రచారం నిర్వహించారు. ఆ తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో సమావేశమయ్యారు. వీరి వెంట పార్లమెంటు పరిశీలకులు, సంతనూతలపాడు శాసనసభ్యులు టీజేఆర్ సుధాకర్‌బాబు, యన్నాబత్తిన వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు సామంతుల రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చుక్కా కిరణ్ కుమార్ ఉన్నారు.

పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్ద

పటిష్టమైన బందోబస్తు

ఎస్పీ వకుల్‌జిందాల్


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ బాపట్ల పట్టణంలోని 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ని, బాలికల ఉన్నత పాఠశాలను, లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ ను ప్రత్యక్షంగా సందర్శించి పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 108 సెంటర్లలో 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరగడానికి ప్రతి సెంటర్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశామని ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగిన వెంటనే వారు ఆ పరీక్ష కేంద్రానికి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష పేపర్లు స్టేషన్ నుండి బయలుదేరి పరీక్ష కేంద్రాల వద్దకు చేరేవరకు, జవాబు పత్రాలు పరీక్ష కేంద్రాల నుండి పోస్ట్ ఆఫీస్ కు చేరేవరకు కావలసిన అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలియజేశారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే ఉపాధ్యాయులు, సహాయక సిబ్బంది వారి మొబైల్ ఫోన్ లను పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకు రాకూడదని, మొబైల్ ఫోన్ లను పరీక్షా సమయానికి ముందుగానే భద్రంగా డిపాజిట్ చేయించాల్సిన బాధ్యత చీఫ్ ఇన్విజిలేటర్లదేనని సూచించారు. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది అలసత్వం వహించకుండా విధులు నిర్వహించాలని ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పీ మురళీకష్ణ , ఎస్.బి ఇన్స్పెక్టర్ వి.మల్లికార్జునరావు , బాపట్ల పట్టణ సిఐ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు కిలో అత్యధిక ధర రూ.231

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి బుధవారం గురవారెడ్డిపాలెం గ్రామ రైతులు వేలం కేంద్రానికి 697 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 640 బేళ్ల కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 57 బేళ్లను తిరస్కరించారు. అత్యధిక ధర కిలో రూ.231 పలుకగా అత్యల్ప ధర రూ.220 పలికింది. సరాసరి కిలో ధర 228.45 రూపాయలు పలికింది .వేలంలో 20 కంపెనీలు పాల్గొన్నాయి. కేంద్రం నిర్వహణాధికారి రవికాంత్ వేలాన్ని నిర్వహించారు.

రూ.24 లక్షలు పట్టివేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని సౌత్ బైపాస్ జంక్షన్ వద్ద ఎన్నికల తనిఖీలో భాగంగా కారులో తరలిస్తున్న రూ.24,87,500ను అధికారులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదు కందుకూరు వద్ద ఫ్యాక్టరీలో పనిచేస్తున్న బీహార్ కార్మికులకు ఇచ్చేందుకు ఒంగోలు నగరంలో ఉన్న అపార్ట్మెంట్ ఆఫీస్ నుంచి తీసుకెళుతున్నట్టు సమాచారం. ఈ డబ్బులకు సరైన ఆధారాలు లేకపోవడంతో ఒంగోలు ఎమ్మార్వో సుజన్‌కుమార్, ఫ్లయింగ్‌స్క్వాడ్ ఇన్‌ఛార్జి ప్రసన్నకుమార్, తాలూకా సిఐ భక్తవత్సలరెడ్డి ఆధ్వర్యంలో డబ్బులు సీజ్ చేశారు.


భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

విప్లవవీరుల వర్ధంతి సందర్భంగా

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

డివైఎఫ్ఐ జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్వాతంత్ర్య సమర యోధులు విప్లవ వీరులు షహీద్, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలతో పాటు సదస్సులు నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె ఎఫ్ బాబు పిలుపునిచ్చారు అందులో భాగంగా బుధవారం ఒంగోలు భగత్‌సింగ్ కాలనీలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె ఎఫ్ బాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన త్యాగధనులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లని తెలిపారు. అమరుల త్యాగాల స్ఫూర్తితో డివైఎఫ్ఐ యువజన సమస్యలపై పోరాడుతూనే సేవా కార్యక్రమాలు, వివిధ రకాల నోటిఫికేషన్ విడుదల అయిన సందర్భంలో అవగాహన సదస్సులు, మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అటువంటి త్యాగధనుల వర్ధంతి మార్చి 23ను పురస్కరించుకొని వర్ధంతి కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా సదస్సులు, ఇతర సేవ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అమరుల స్ఫూర్తితో ప్రభుత్వ రంగ సంస్థలను కాపడుకుందామని, విభజన హామీలు అమలు కోసం సంఘటితం అవుదామన్నారు. అమరుల వర్ధంతి కార్యక్రమాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తంబి శ్రనివాసులు, డివైఎఫ్ఐ నగర నాయకులు పి. వెంకటరావు, ప్రభు, వెంకటేష్, మహిళా సంఘం నాయకురాలు కె.విజయమ్మ పాల్గొన్నారు.